# నమస్తే తెలంగాణ
# నిజామాబాద్

5 | నిజామాబాద్, శుక్రవారం 31 జనవరి 2025 | NIZAMABAD


ఎల్లారెడ్డి పాఠశాలలో విషాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరమని కవిత అన్నారు. కేసీఆర్ పెట్టిన గురుకులాలను కూడా నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ప్రభుత్వం తక్షణమే మొద్దు నిద్ర వీడి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల ధర్పల్లి మండలంలో రైతుభరోసా అందించింది పది శాతం మందికేనని, కానీ కేసీఆర్ 80 శాతం మంది రైతులకు రైతుబంధు అందించారన్నారు. పసుపు పంట మార్కెట్‌కు వస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని కవిత కోరారు. ఈ మేరకు ఎంపీ అర్వింద్ చొరవ తీసుకోవాలని సూచించారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

### జనం తిరుగుబాటు..

అమలు కానీ హామీలు ఇచ్చి మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడుతున్నారని కవిత తెలిపారు. ఇటీవల గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారన్నారు. రైతు భరోసా, రేషన్ కార్డులు ఎవరికిస్తున్నారో అర్థం కానీ పరిస్థితి ఏర్పడిందన్నారు. సచివాలయంలో ఏసీ గదుల్లో కూర్చుని తయారుచేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామాల్లోకి వెళ్లి చదువుతున్నారని మండిపడ్డారు. ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీస్తే అది తుది జాబితా కాదని మాట మారుస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇండ్లు, రైతుభరోసా, రేషన్ కార్డులు ఇచ్చే ఆలోచనతో ఉందన్నారు. తాము చెప్పిన వాళ్లకే పథకాలు వస్తాయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రకటనలు చేస్తున్నారన్నారు. గతంలో కేసీఆర్ అర్హులందరికీ పారదర్శకంగా పథకాలను అందించారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన వాటినే అటూ ఇటూ మార్చి కాంగ్రెస్‌ప్రభుత్వం అమలు చేస్తున్నదని కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదేమి లేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులను తామే చేశామని చెప్పడమే తప్ప రేవంత్ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని విమర్శించారు.

కేసీఆర్ పథకాలనే మార్చి అమలు చేస్తుండ్రు

# కాంగ్రెస్ చేసిందేముంది?

- హస్తం పార్టీది మోసాల చరిత్ర
- అబద్ధాలతో రేవంత్ కాలం వెళ్లదీత
- గురుకులాలను కూడా నడపడం చేతకావట్లేదు
- కాంగ్రెస్ దుష్పరిపాలనతో తెలంగాణ వందేళ్లు వెనక్కి
- రాష్ట్ర దుస్థితిపై రాహుల్‌గాంధీ స్పందించరెందుకు?
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం

ధర్పల్లి/ఖలీల్‌వాడి, జనవరి 30: కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో భయంకరమైన రోజులు వచ్చాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దుష్పరిపాలనతో తెలంగాణ వందేళ్లు వెనక్కి వెళ్లే పరిస్థితి తలెత్తిందన్నారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అబద్ధాలతో సీఎం రేవంత్‌రెడ్డి కాలం వెల్లదీస్తున్నారని విరుచుకుపడ్డారు. అబద్ధం అద్దం ముందు నిలబెడితే రేవంత్‌రెడ్డి బొమ్మ కనబడుతుందని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టి ఎక్కువ కాలం పాలించలేరనారు. అలవిగాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. గురువారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ఎమ్మెల్సీ కవిత దంపతులు.. ధర్పల్లిలో ఓ శుభకార్యానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి కవిత విలేకరులతో మాట్లాడారు.

### ప్రజలను మోసగిస్తారా?

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసీ తెలియక హామీలిచ్చామని స్వయంగా అసెంబ్లీ స్పీకర్ అన్నారని గుర్తు చేసిన ఎమ్మెల్సీ కవిత.. 130 ఏండ్ల చరిత్ర ఉందని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎలా మోసం చేస్తుందని ప్రశ్నించారు. చేతిలో ఎర్రబుక్ పట్టుకుని దేశమంతా తిరిగే రాహుల్‌గాంధీ తెలంగాణ స్థితిగతులపై ఎందుకు మాట్లాడడం లేదని సూటిగా నిలదీశారు. గతంలో తెలంగాణను ఆంధ్రలో కలిసి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కూడా అదే ఒరవడిని కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసాల చరిత్ర, దగా చరిత్ర అని విరుచుకుపడ్డారు.

### సమస్యలు పునరావృతం..



కాంగ్రెస్ రాకతో ప్రజలు, రైతులకు మళ్లీ సమస్యలు మొదలయ్యాయని కవిత అన్నారు. యూరియా కోసం రైతులు మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. కరెంట్ ఎప్పుడొస్తుందా ఎప్పుడు పోతుందా అన్నది తెలియని దుస్థితి ఏర్పడిందని, చెరువులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. జిల్లాకు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 21 పనులు పూర్తి చేయని చేతగాని ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమని ధ్వజమెత్తారు.

### హామీలు ఏమైనయ్..?

ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చారని, గద్దెనెక్కాక వాటిని పక్కన బెట్టారని మండిపడ్డారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయడం లేదని ఎండగట్టారు. పెన్షన్ మొత్తాన్ని పెంచకుండా కాంగ్రెస్‌ప్రభుత్వం మోసం చేసిందని, కేసీఆర్ హయాంలో ఇచ్చిన పెన్షన్లే ఇంకా ఇస్తున్నారని పెన్షన్ మొత్తాన్ని పెంచటంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారని వివరించారు. 18 ఏండ్లు నిండిన మహిళలందరికీ రూ. 2,500 ఇస్తామన్నారని, అది ఎప్పటి నుంచి ప్రారంభిస్తారని నిలదీశారు. ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని చెప్పారని, అవి ఎటుపోయాయని ప్రశ్నించారు.

### అబద్ధాల కోరు రేవంత్

ఆరు గ్యారంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆరింట్లో ఏదీ సరిగ్గా అమలు చేయడం లేదని బాజిరెడ్డి మండిపడ్డారు. రేవంత్ పచ్చి అబద్ధాల కోరని మండిపడ్డారు. ఇప్పుడు ఎమ్మెల్సీ కోడ్ వచ్చింది, తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వస్తుంది, దాంతోనే కాలం వెల్లదీస్తారని, ఇక ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేది ఎప్పుడని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఒత్తిడి వల్లే రైతు భరోసా, రుణమాఫీ అంత మాత్రమైనా వచ్చిందన్నారు. మాజీ ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, నాయకులు రాజ్‌పాల్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, లింగం పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలేది?
### మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను మోసం చేసిందని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా విమర్శించారు. డిక్లరేషన్ల పేరుతో, గ్యారంటీల పేరుతో 420 బూటకపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వంద రోజుల్లో అమలు చేస్తామని ఊదరగొట్టిందన్నారు. కానీ 420 రోజులు గడుస్తున్నా హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కేటీఆర్ పిలుపు మేరకు నిజామాబాద్‌లోని గాంధీచౌక్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిగాల మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత జనాలను ముప్పుతిప్పలు పెడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో 6.47 లక్షల కొత్త కార్డులు ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు గోబెల్ సిగ్గుపడేలా అబద్ధాలను ప్రచారం చేశారని మండిపడ్డారు. తెలంగాణ యువతకు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రాహుల్‌గాంధీ ముఖం చాటేశాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందులో నాలుగో వంతు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో 2 లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదని బిగాల మండిపడ్డారు. రైతుల తరఫున బీఆర్‌ఎస్ పోరాటం చేస్తే కొందరికి మాత్రమే మాఫీ చేశారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కరోనా లాక్‌డౌన్, నోట్ల రద్దు లాంటి ఆర్థిక సంక్షోభ పరిస్థితులున్నప్పటికీ కేసీఆర్ రూ.28,725 కోట్ల రుణ మాఫీ చేశాడని తెలిపారు. 420 రోజులు గడుస్తున్నా రేవంత్ సర్కారు రైతు భరోసా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి కింద రూ.లక్ష చెక్కుతోపాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో 412 మంది రైతుల ఆత్మహత్యలు, 100 మందికి పైగా ఆటో డ్రైవర్ల బలవన్మరణాలు చోటు చేసుకున్నాయన్నారు. గురుకులాల్లో కల్తీ ఆహారంతో 55 మందికి పైగా విద్యార్థుల దుర్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నమైందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని, వారు కాంగ్రెస్‌కు కచ్చితంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మాజీ మేయర్ దండు నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నేతలు సత్యప్రకాశ్, దండు శేఖర్, నవీద్ ఇక్బాల్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.


నిజామాబాద్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బిగాల, నీతూకిరణ్, ప్రభాకర్‌రెడ్డి

# మహాత్మా.. మేలుకొలుపు

## కాంగ్రెస్ ప్రభుత్వ కండ్లు తెరిపించు

- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు
- మోసపూరిత వాగ్దానాలతో వంచించిన కాంగ్రెస్
- 420 హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్

**అబద్ధపు హామీలతో ప్రజలను** మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు నివాళులర్పించడంతో పాటు వినతిపత్రాలు అందజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల వ్యాప్తంగా గులాబీ శ్రేణులు మహాత్ముడికి వినతిపత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కండ్లు తెరిపించి ఇచ్చిన హామీలను అమలు చేసేలా చూడాలని విన్నవించారు. నిజామాబాద్ నగరంలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గాంధీచౌక్‌లోని మహాత్ముడి విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అలాగే, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో బిచ్కుందలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బోధన్, ఆర్మూర్ డివిజన్లలోనూ బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి.

–ఖలీల్‌వాడి/కంఠేశ్వర్/బిచ్కుంద, జనవరి 30


కామారెడ్డిలో వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు
### మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ఇంకా అబద్ధాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ధ్వజమెత్తారు. బిచ్కుందలో మహాత్ముడి విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం వినతిపత్రం అందజేశారు. అనంతరం షిండే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణను ప్రగతి పథంలో నడిపించామన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. తెలంగాణ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చి దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. కానీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 420 రోజులు పూర్తయినా ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేదన్నారు. మోసపూరిత వాగ్దానాలతో సీఎం రేవంత్ ప్రజలను వంచిస్తున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేయకుండా అటెన్షన్ డైవర్షన్‌తో కాలం వెళ్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 రోజుల్లో అమలు చేస్తామన్న రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాలు ఇప్పటికీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అబద్ధపు మాటలు చెప్తున్న కాంగ్రెస్ పార్టీ.. 2021లో కేసీఆర్ ప్రభుత్వంలో పంపిణీ చేసిన రేషన్ కార్డుల కార్యక్రమంలో ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పాల్గొన్న విషయం గుర్తు లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా బీఆర్‌ఎస్ ప్రజల తరఫున పోరాడుతుందన్నారు. నాయకులు నాల్చర్ రాజు, మల్లికార్జున్, నాల్చర్ బాలాజీ, యాదారావు, హన్మాండ్లు, ముఖీద్ పాల్గొన్నారు.


బిచ్కుంద మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే


గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బిగాల

## బిగాల ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు..

ఖలీల్‌వాడి, జనవరి 30: మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో సుమారు వంద మందికి పైగా బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో 35వ డివిజన్‌కు చెందిన నరేశ్‌తో పాటు వంద మందికి పైగా యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి బిగాల గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని పార్టీలో చేరినట్లు యువకులు తెలిపారు.

**చందూర్‌లో** అల్లమాప్రభు జాతర ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన కుస్తీ పోటీల్లో మహారాష్ట్రకు చెందిన 14 ఏండ్ల పల్లవి సత్తా చాటింది. బలమైన ప్రత్యర్థులను చిత్తు చేసి విజేతగా నిలిచింది. మల్ల యుద్ధంలో స్థానికంగా ఉన్న మహామహులను ఓడించిన బాలిక 'పట్టు'దలను చూసి అక్కడున్న వారు అబ్బురపడ్డారు.

– చందూర్, జనవరి 30


కుస్తీ పోటీల్లో గెలుపొందిన మహారాష్ట్రకు చెందిన పల్లవికి బహుమతి అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## మళ్లీ దవాఖానలో చేరిన విద్యార్థులు

- ఎల్లారెడ్డి హెచ్‌ఎంపై వేటు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీ తొలగింపు


ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో విద్యార్థులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 30: ఎల్లారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులు మరోమారు కడుపునొప్పితో సతమతమయ్యారు. దీంతో గురువారం ఉదయం వారిని దవాఖానలో చేర్పించారు. బుధవారం భోజనం తిన్న పిల్లలు వాంతులు, కడుపునొప్పితో బాధ పడగా దవాఖానలో చేర్పించిన సంగతి తెలిసిందే. ఆరోగ్యం కుదుటపడడంతో రాత్రికే ఇంటికి పంపించారు. అయితే, గురువారం ఉదయం నుంచి కడుపునొప్పి రావడంతో వారిని వెంటనే దవాఖానకు తీసుకెళ్లారు. పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, నాణ్యమైన వైద్యం అందించాలని తల్లిదండ్రులు కోరారు. ఫుడ్ పాయిజన్ వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయని, రెండు, మూడ్రోజుల్లో తగ్గిపోతుందని వైద్యులు తెలిపారు. దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆర్డీవో ప్రభాకర్ పరామర్శించారు.

**హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు**

ఫుడ్ పాయిజన్ ఘటన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు. హెడ్మాస్టర్‌పై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు మధ్యాహ్న భోజన ఏజెన్సీని తొలగించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాఠశాలను తనిఖీ చేశారు. అనారోగ్యం పాలైన విద్యార్థుల వివరాలను తెలుసుకొని, వారిని పిలిపించి మాట్లాడారు. ఏజెన్సీలో వంట సామగ్రి, సరుకులను పరిశీలించిన ఆయన ఫుడ్ పాయిజనింగ్ ఎలా అయిందో ఫుడ్ సేఫ్టీ అధికారి శిరీషను అడిగి తెలుసుకున్నారు. వెంటనే మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలిని తొలగించి కొత్త వారిని పెట్టాలని ఆదేశించారు. అంతకు ముందు ఇన్‌చార్జి డీఈవో బల్‌రాం, ఫుడ్ సేఫ్టీ అధికారి శిరీష పాఠశాలకు వచ్చి స్టోర్ రూంను, సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్, ఎంఈవో వెంకటేశం ఉన్నారు.

## రాఘవపల్లికి హైకోర్టు న్యాయమూర్తి

నాగిరెడ్డిపేట, జనవరి 30: మండలంలోని రాఘవపల్లి గ్రామంలో గురువారం జరిగిన పోచమ్మ పండుగకు హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేనారెడ్డి దంపతులు హాజరయ్యారు. తన కుమార్తె వివాహం నేపథ్యంలో గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాఘవపల్లికి చెందిన రవీందర్‌రెడ్డి కుమార్తె రూపను జడ్జి విజయ్‌సేనారెడ్డి వివాహమాడారు. వారి తనయ అఖిల పెండ్లి సందర్భంగా, సతీమణి స్వగ్రామంలో గురువారం పోచమ్మ పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి విజయ్‌సేనారెడ్డి, దగ్గరి బంధువులు హాజరయ్యారు. న్యాయమూర్తి రాక నేపథ్యంలో ప్రొటోకాల్ ప్రకారం డీఎస్పీ శ్రీనివాస్ అధ్వర్యంలో పోలీసులు గౌరవ వందనం చేశారు. మరోవైపు, గ్రామంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామానికి వచ్చి పోయే వారిని నిశితంగా తనిఖీ చేశారు. ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు జడ్జి హారిక, ఆర్డీవో ప్రభాకర్, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మల్లారెడ్డి పాల్గొన్నారు.


రాఘవపల్లిలో హైకోర్టు జడ్జి విజయసేనారెడ్డికి గౌరవ వందనం చేస్తున్న పోలీసులు


